PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :203 | పేజీలు : 8 | వెల రూ.5 | శనివారం 15.08.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh






# ఇన్వెస్ట్.. తెలంగాణ

## రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0

- రేవంత్ రెడ్డి కేబినెట్ గ్రీన్‌సిగ్నల్
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మెగా సదస్సు
- కొత్త ల్యాండ్ పూలింగ్ విధానానికి ఆమోద ముద్ర
- కొత్త రేషన్ కార్డులు పంపిణీకి పచ్చజెండా
- ఉచిత విద్యుత్ పథకాన్ని మరింతమందికి ఇచ్చేందుకూ ఓకే

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడం, రాష్ట్ర పారిశ్రామిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు సదస్సును ఘనంగా నిర్వహించనున్నారు. గత ఏడాది నిర్వహించిన సదస్సు కంటే మరింత భారీ స్థాయిలో ఈసారి కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.. ఈ కేబినెట్ మీటింగ్ లో మొత్తం 36 అంశాలపై చర్చించారు.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' ప్రధాన థీమ్‌గా సదస్సు జరగనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా, ఐటీతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. భవిష్యత్ హైదరాబాద్ అభివృద్ధికి కీలకంగా భావిస్తున్న ఫ్యూచర్ సిటీ ప్రణాళికను కూడా అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను రూపొందించనున్నారు. రాష్ట్రంలోని స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలను ప్రదర్శించడంతో పాటు వివిధ రంగాల్లో జరిగిన కొత్త ఆవిష్కరణలను ప్రదర్శించే ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సదస్సు నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నారు.

### కొత్త ల్యాండ్ పూలింగ్ విధానంపై కీలక నిర్ణయం

కేబినెట్ సమావేశంలో కొత్త ల్యాండ్ పూలింగ్ విధానంపై కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు0 ప్రస్తుత నిర్బంధ భూసేకరణ విధానానికి బదులుగా భాగస్వామ్య ఆధారిత నమూనానుతీసుకురావాలనిప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిపాదిత విధానం ప్రకారం భూములు ఇచ్చే యజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్లలో 60 శాతం తిరిగి కేటాయించి, మిగిలిన 40 శాతాన్ని హెచ్ఎండీఏ, టీజీఐఐసీ వంటి ప్రభుత్వ సంస్థలు అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు. ఈ విధానం ద్వారా భూసేకరణకు సంబంధించిన వివాదాలను తగ్గించడంతో పాటు భూయజమానులకు దీర్ఘకాలిక ప్రయోజనంకల్పించాలన్నదిప్రభుత్వఉద్దేశంగా చెబుతున్నది.



### సంక్షేమ పథకాల విస్తరణపై కసరత్తు

సంక్షేమ రంగంలోనూ పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 41 లక్షల మందికి పెన్షన్లు అందుతున్న నేపథ్యంలో మరో 2.25 లక్షల మంది లబ్ధిదారులను చేర్చే ప్రతిపాదన గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రయోజనాన్ని మరో 3 నుంచి 4 లక్షల కుటుంబాలకు విస్తరించే అంశం, మహాలక్ష్మి పథకం కింద రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్ అందించే పథకాన్ని మరో 5 లక్షల కుటుంబాలకు వర్తింపజేసే ప్రతిపాదనలపై కేబినేట్ సమగ్రంగా చర్చించింది.

### అసెంబ్లీ ప్రత్యేక సమావేశంపై చర్చ

అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహణపైనా కేబినెట్ లో చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 20 నుంచి నెలాఖరు వరకు బ్రిటన్, అమెరికా, దుబాయ్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఆగస్టు 17 లేదా 18న నిర్వహించే అవకాశాలపై మంత్రుల అభిప్రాయాలను సేకరించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 25 నుంచి 21 సంవత్సరాలకు, రాజ్యసభ, శాసనమండలి ఎన్నికలకు పోటీ చేసే కనీస వయస్సును 30 నుంచి 25 సంవత్సరాలకు తగ్గించాలనే తీర్మానం చేసే అంశం ఈ సమావేశంలో పరిశీలించారు.

### మూసీ, ఇందిరమ్మ టవర్స్‌పైనా నిర్ణయాలు

ఇవే కాకుండా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు, మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమాలు, గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనుల ప్రారంభం వంటి అంశాలపైనా కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పెట్టుబడులు-పారిశ్రామికాభివృద్ధి ,సంక్షేమం, భూసేకరణ, హైదరాబాద్ అభివృద్ధి తో పాటు పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే నేపథ్యం మంత్రివర్గంలో చర్చించారు.

## ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిన దేశ విభజన: మోదీ



ఢిల్లీ,ప్రభాత సూర్యుడుదేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది."ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయి" అని మోదీ పేర్కొన్నారు.



# హర్ ఘర్ తిరంగా ర్యాలీ -- ములుగు

### నవయుగ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గుణిశెట్టి సందీప్




ములుగు ఆగస్టు 14 ప్రభాత సూర్యుడు ములుగు జిల్లా కేంద్రంలో మేర యువ భారత్ వారి సహకారంతో, నవయుగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్ అధ్యక్షులు గుణిశెట్టి సందీప్ నేతృత్వంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ములుగు పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీని ములుగు డిగ్రీ కళాశాల నుండి సాయిబాబా టెంపుల్ సర్కిల్ వరకు యువతతో కలిసి నిర్వహించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాను చేతబూని దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, యువతలో దేశభక్తి, జాతీయ ఐక్యత , జాతీయ పతాకంపై గౌరవాన్ని పెంపొందించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.తిరంగా మన గర్వం దేశం మన బాధ్యత అనే సందేశంతో ప్రతి ఒక్కరూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఏజెన్సీ ఏరియా ప్రజలకు 80 వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు బి.రాహుల్

భద్రాచలం ఆగష్టు14 ప్రభాత సూర్యుడు ఏజెన్సీ ఏరియాలలోని



మండలాలు, గిరిజన గ్రామాలలో పనిచేయు చున్న ఉద్యోగులకు, ఉపాధ్యా యులకు, ఏజెన్సీ ఏరియా ఆదివాసి గిరిజన కుటుంబాలకు, విద్యార్థిని, విద్యార్థులకు, ఐటీడీఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులకు, సిబ్బందికి, 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలు పుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ ఏరియాలలో పనిచేయుచున్న ఉద్యోగులు, గిరిజన ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు అందరూ సంతోషంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొనాలని కోరుచూ అందరికీ మరి ఒకసారి 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న మహేశ్వరి కుటుంబానికి ఎమ్మెల్యే ఎల్ఓసీ ద్వారా రూ.5 లక్షల ఆర్థిక సహాయం...

దుమ్ముగూడెం ఆగస్టు 14 ప్రభాత సూర్యుడు.దుమ్ముగూడెం మండలం,



బైరాగులపాడు గ్రామానికి చెందిన తుర్రం మహేశ్వరి అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల కోసం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఎల్ఓసీ ద్వారా మంజూరైన రూ.5,00,000/- (ఐదు లక్షల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.ప్రజల కష్టాల్లో అండగా నిలుస్తూ, అత్యవసర వైద్య సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, భీమవరపు వెంకటరెడ్డి, చింతాడి రామకృష్ణ, గుండెపల్లి హనుమంతురావు, కంప్యూటర్ ఆపరేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి, 3 జీవో,1/70 చట్టాల పై స్పష్టత ఇవ్వాలి

### జీ ఎస్ పి ములుగు జిల్లా అధ్యక్షుడు పూనేం ప్రతాప్

### ఆదివాసీ ప్రజాప్రతినిధులు వాన కాలం అసెంబ్లీ సమావేశంలో నోరు విప్పాలి

ములుగు ఆగస్టు 14 ప్రభాత సూర్యుడువెంకటాపురం జీవో నెంబర్ 3కి ప్రత్యామ్నాయ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలని, ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంత చట్టాలను కాపాడడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం విఫలం అవుతుందని, ఆదివాసి చట్టాలను హక్కులను కాలరాసే ప్రయత్నం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 3జీవో ని పునరుద్ధరించడానికి,రాజ్యాంగ నిపుణులతో చర్చించి ప్రత్యేక చట్టం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని పూనెం ప్రతాప్ గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల భూ రక్షణ చట్టం రక్షించాల్సిన బాధ్యత ఆదివాసి ప్రజాప్రతినిధులపై ఉందని ఆయన అన్నారు,ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకపోవడం వల్ల మైదాన ప్రాంతాల నుంచి నాన్-ట్రైబల్స్ భారీగా వలసలు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇక్కడి భూముల అమ్మకాలకు, కొనుగోలుకు తమకు కూడా అవకాశం కల్పించాలని, 1/70 చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ నాన్-ట్రైబల్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే మేల్కొనకపోతే ఆదివాసుల అస్తిత్వానికి, మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు.జీవో 3 ప్రత్యామ్నాయ చట్టం, 1/70 చట్టాల పరిరక్షణకు గొండ్వానా సంక్షేమ పరిషత్ దశల వారి ఉద్యమలు కొనసాగిస్తుందని



ఆయన హెచ్చరించారు. గతంలో జీవో నెంబర్ 3 విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఆదివాసులకు ఎటువంటి చేదు అనుభవాన్ని మిగిల్చిందో, భూ చట్టం విషయంలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటే అదే పరిస్థితి పునరావృతమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వానాకాలం అసెంబ్లీ సమావేశాల్లో ఆదివాసీ ప్రజాప్రతినిధులు నోరు విప్పాలి. లేకుంటే జాతి ద్రోహులే అవుతారని హెతువు చేశారు.ఆదివాసుల ఉనికి, సంస్కృతి నిలబడాలంటే భూ రక్షణ చట్టాల అమలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఆదివాసి ప్రజాప్రతినిధులు తమ స్వార్థాన్ని పక్కనపెట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, జీవో 3 ప్రత్యామ్నాయ చట్టం మరియు 1/70 పరిరక్షణకు ప్రభుత్వం ముందడుగు వేసేలా చేయాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో, చరిత్రలో ప్రభుత్వంలో ఉన్న ఆదివాసి ప్రజాప్రతినిధులు 'జాతి ద్రోహులుగా మిగిలిపోతారని పూనెం ప్రతాప్ అన్నారు.16 న ములుగు జిల్లా పర్యటనకు వస్తున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి 1/70,3 జీవో చట్టాల పై పూర్తి స్పష్టత ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు.

# భూభారతి రీసర్వేకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి

### అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ మల్కాజ్గిరి ఆగష్టు 14 ప్రభాత సూర్యుడురాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి భూముల రీసర్వే కార్యక్రమానికి ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం మేడ్చల్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూభారతి రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ పరిశీలించారు. రీసర్వే నిర్వహణ తీరును, భూ వివరాల నమోదు ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియకు సంబంధించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.జిల్లాలో మొత్తం 11 గ్రామాల్లో భూభారతి



భూముల రీసర్వే కొనసాగుతోందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందులో మేడ్చల్, ఘట్కేసర్, కీసర మండలాల్లో మూడేసి గ్రామాలు, మూడుచింతలపల్లి, శామీర్‌పేట్ మండలాల్లో ఒక్కొక్క గ్రామం చొప్పున రీసర్వే చేపడుతున్నట్లు వివరించారు. భూముల హద్దులు, హక్కులు, భూ వివరాల నమోదు వంటి అంశాల్లో రీసర్వే కీలకమైనందున రైతులు, భూ యజమానులు అధికారులకు అవసరమైన సమాచారం అందించి ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భూపాల్ రీసర్వే ప్రక్రియకు సంబంధించిన వివరాలను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వివరించారు.



# ఐటీడీఏ లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ రిహార్సల్

### డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన

భద్రాచలం ఆగస్టు 14 ప్రభాత సూర్యుడు 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తారీఖు నాడు ఉదయం ఐటిడిఏ కార్యాలయం నందు జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో వివిధ పాఠశాలల నుండి వచ్చిన గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు మార్చ్ ఫాస్ట్ రిహార్సల్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని శ్రీమతి చందన అన్నారు.శుక్రవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు ఐటిడిఏ ఆవరణలో వివిధ పాఠశాల నుండి వచ్చిన 80 మంది గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు ఈనెల 15వ తారీఖు నాడు ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణకు ముందు విద్యార్థినీ విద్యార్థుల చేత నిర్వహించవలసిన మార్చ్ ఫాస్ట్ రిహార్సల్ కార్యక్రమాన్ని ఐటీడీఏ యూనిట్ అధికారుల సమక్షంలో పరిశీలించి విద్యార్థినీ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇస్తూ పిల్లల చేత వివిధ రకాల విన్యాసాలు చేయించారు.ముఖ్యంగా ఐటీడీఏ పీవో కి గౌరవ వందనం ఏ విధంగా చేయాలో, దానికి సంబంధించిన మెలకువలు విద్యార్థిని విద్యార్థులకు స్వయంగా చూపించారు. అదేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులతో ఎన్సీసీ శిక్షకుడు నాగులు, తారాచంద్ సారాజ్యంలో పలు రకాల మార్చ్ ఫాస్ట్ రిహార్సల్స్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి రాంబాబు, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, పి వి టి జి అధికారి గన్యా నాయక్, పిటిసి ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏ పీ ఓ పవర్ వేణు, స్పోర్ట్స్ అధికారి గోపాలరావు, స్కౌట్ మాస్టర్ చలపతిరావు, ఎన్సిసి స్కౌట్ ఎస్కార్ట్ నాగులు, తారా సింగ్, పి ఈ టి గీత,అరుణ, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



# మండల ప్రజావాణి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.

### ఆగస్టు 17 నుంచి మండల ప్రజావాణి.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.



ఖమ్మం, ఆగస్టు 14 ప్రభాత సూర్యుడు.మండల స్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ఆగస్టు 17వ తేదీ (సోమవారం) నుంచి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించుచున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల కేంద్రాల్లోను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో మండల ప్రజావాణి నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల ప్రజావాణి కార్యక్రమాన్ని సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించాలన్నారు.మండల ప్రజావాణి నిర్వహణకు అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణను ఆగస్టు 16వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు లాగిన్ ఐడీలు, యూజర్ గైడ్స్ అందజేయాలని సూచించారు.ప్రజావాణి నిర్వహించే ప్రదేశంలో ప్రజలకు, అధికారులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు కంప్యూటర్, ప్రింటర్, స్కానర్ తదితర పరికరాలను సిద్ధంగా ఉంచాలని అన్నారు. మండల ప్రజావాణి ప్రారంభం, నిర్వహణపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా ముందస్తుగా సమాచారం పంపాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, డీసీఓ గంగాధర్, డీఎస్ఓ చందన్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్డబ్ల్యూఎస్ ఇఇ వాణిశ్రీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాచర్ల పుల్లమ్మ మృతి పట్ల నివాళి.




కారేపల్లి ఆగస్టు 14 ప్రభాత సూర్యుడు అణగారిన బతుకు లలో వెలుగులు నింపేందుకు ఉద్యమించిన ఎర్రజెండా సిపిఎం బలమైన సానుభూతి పరురాలు మాచర్ల పుల్లమ్మని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ కొనియాడారు. శుక్రవారం చీమలపాడు గ్రామంలో వృద్ధాప్య సమస్యలతో మరణించిన మాచర్ల పుల్లమ్మ మృతదేహం పై పార్టీ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. చీమలపాడు ప్రాంతంలో అణగారిన వర్గాల హక్కులకై కూలి పోడు రైతుల సమస్యలపై నిత్యం జరిగిన పోరాటంలో అని నిత్యం పార్టీకి ఎన్నింటి ఉండి సేవలు అందించిన పుల్లమ్మ కృషి మరువరానిదని పేర్కొన్నారు. అందులో భాగంగానే పార్టీ లో తమ కుటుంబాన్ని నిలబెట్టే దాంట్లో అవిరల కృషి చేశారని అందుకే పుల్లమ్మ జీవితం ధన్యమని,ఎందరో ఆదర్శమని నేటి మహిళా యువతీ యువకులు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఎర్రజెండా బాటలో నడవాలని మీరు సత్యనారాయణ పిలుపునిచ్చారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర, ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు,మండల కార్యదర్శి వర్గ సభ్యులు అజ్మీర శోభన్ బాబు, మండల కమిటీ సభ్యులు చీమలపాడు శాఖ కార్యదర్శి యనమనగండ్ల రవిబాబు, రేలకాయలపల్లి శాఖ కార్యదర్శి రేమల్లె వీరస్వామి, రేల కాయల పల్లి చెరువు సొసైటీ అధ్యక్షులు ఎరిపోతు భద్రయ్య,పార్టీ సభ్యులు షేరు వెంకటేశ్వర్లు,ఎస్కే. చిన్న సైదులు, రాచర్ల రణధీర్, కుమారుడు మాచర్ల రమేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కుంట్లూరులో మానసిక స్థితి సరిగా లేని మహిళ అదృశ్యం

ప్రభాత సూర్యుడు హయత్‌నగర్:హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూరు వసంత నగర్ కాలనీలో 60 ఏళ్ల మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే...కుంట్లూరు వసంత నగర్ కాలనీకి చెందిన బుయ్యవరపు వైష్ణవ్ ఈ నెల 13న ఉదయం 11:00 గంటల సమయంలో తన పని నిమిత్తం బయటకు వెళ్లారు. అదే సమయంలో ఆయన తండ్రి పురుషోత్తమసూరి కూడా డ్యూటీ నిమిత్తం బయటకు వెళ్లడంతో, మానసిక స్థితి సరిగా లేని తల్లి బొయ్యవరపు మైత్రి (60) ఇంట్లోనే ఒంటరిగా ఉన్నారు. రాత్రి 11:00 గంటల ప్రాంతంలో వైష్ణవ్ ఇంటికి తిరిగి వచ్చి చూడగా తల్లి కనిపించలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కాలనీ పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద ఎంత వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు వైష్ణవ్ హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# స్వాతంత్ర్యం దేశాన్ని ఇచ్చింది... బాధ్యతే భవిష్యత్తును నిర్మించాలి

**80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన బిల్డింగ్స్ స్పెషలిస్ట్ కాంట్రాక్టర్ హరి రాపూరి**



ప్రభాత సూర్యుడు తిరుపతి, ఆగస్టు 14: “స్వాతంత్ర్యం మనకు దేశాన్ని ఇచ్చింది... బాధ్యతతో కూడిన మన కృషే భారత భవిష్యత్తును నిర్మించాలి” అని బిల్డింగ్స్ స్పెషలిస్ట్ కాంట్రాక్టర్ హరి రాపూరి, బి.ఇ. (సివిల్) పిలుపునిచ్చారు. భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన దేశ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.టీటీడీ, ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో చేపడుతున్న హరి రాపూరి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులకు ఘన నివాళులర్పించారు.“త్యాగాలతో సాధించిన స్వాతంత్ర్యాన్ని ఐక్యత, బాధ్యత, నిజాయితీతో కూడిన సేవ ద్వారా భవిష్యత్ తరాలకు మరింత బలమైన భారతదేశంగా అందించాలి.’1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందిన భారతదేశం 2026 ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ప్రతి భారతీయుడు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని ఆయన పేర్కొన్నారు.స్వాతంత్ర్య దినోత్సవం కేవలం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు జరుపుకునే సందర్భం మాత్రమే కాదని, దేశ సమైక్యతను కాపాడటం, ప్రజాస్వామ్య మరియు రాజ్యాంగ విలువలను గౌరవించడం, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని హరి రాపూరి అన్నారు.నాణ్యమైన మౌలిక వసతులే దేశాభివృద్ధికి పునాది దేశ నిర్మాణంలో మౌలిక వసతుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న హరి రాపూరి, నాణ్యమైన, సురక్షితమైన, దీర్ఘకాలిక భవనాలు మరియు ప్రజా మౌలిక వసతులు సమాజ పురోగతికి బలమైన పునాది అని తెలిపారు.ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, కార్మికులు, ప్రభుత్వ సంస్థలు ప్రతి నిర్మాణంలో నాణ్యత, భద్రత, పారదర్శకత, జవాబుదారీతనానికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.“మనం కేవలం భవనాలను నిర్మించడం లేదు... ప్రజలకు సేవ చేసే మౌలిక వసతులను నిర్మిస్తూ దేశ భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నాం.”యువత తమ విద్య, నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతను దేశ పురోగతికి వినియోగించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, సమగ్రత, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన హరి రాపూరి, విభేదాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా శాంతియుత, సుసంపన్న, సమగ్ర, స్వావలంబన భారతదేశ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.“మన స్వాతంత్ర్యం లక్ష్యాన్ని ప్రేరేపించాలి... మన ఐక్యత బలాన్ని పెంచాలి... మన కృషి రేపటి భారతదేశాన్ని నిర్మించాలి.”జై హింద్! జై భారత్!

# స్వాతంత్ర్యం దేశాన్ని నిర్మించింది... దార్శనికత భవిష్యత్తును నిర్మించాలి: సిలువేరు శ్రీహరి

**80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన SLN శ్రీ లక్ష్మీ నివాస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ డైరెక్టర్, కింగ్ మేకర్స్ టీమ్ లీడర్**

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు: ఆగస్టు 15: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా SLN శ్రీ లక్ష్మీ నివాస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ డైరెక్టర్, కింగ్ మేకర్స్ టీమ్ లీడర్ సిలువేరు శ్రీహరి తెలంగాణ ప్రజలతో పాటు దేశ ప్రజలందరికీ హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యం సాధించగా, 2026 ఆగస్టు 15తో 79 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోందని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులకు శ్రీహరి ఘన నివాళులర్పించారు. వారి త్యాగాలు, ధైర్యసాహసాలు, దేశభక్తి భావాలు నేటి తరంతో పాటు భావితరాలకు నిరంతరం స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు.‘స్వాతంత్ర్యం మన దేశాన్ని నిర్మించింది... దార్శనికత మన దేశ భవిష్యత్తును నిర్మించాలి.స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం ఒక వేడుకగా మాత్రమే చూడకూడదని, దేశ సమైక్యతను కాపాడటం, ప్రజాస్వామ్య విలువలను గౌరవించడం, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని శ్రీహరి పిలుపునిచ్చారు.“ప్రతి కుటుంబం గౌరవంగా జీవించినప్పుడే, ప్రతి యువతకు అవకాశాలు లభించినప్పుడే, ప్రతి పౌరుడు దేశ నిర్మాణంలో భాగస్వామి అయినప్పుడే స్వాతంత్ర్యానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. శాంతియుత, సుసంపన్న, స్వావలంబన భారతదేశ నిర్మాణమే మనందరి లక్ష్యం కావాలి” అని పేర్కొన్నారు.**బాధ్యతాయుత అభివృద్ధితోనే బలమైన భారత్** దేశ ఆర్థికాభివృద్ధిలో మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ రంగాలకు కీలక పాత్ర ఉందని శ్రీహరి అభిప్రాయపడ్డారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధిలో పారదర్శకత, చట్టబద్ధత, వినియోగదారుల విశ్వాసం, బాధ్యతాయుత పెట్టుబడులకు ప్రాధాన్యం ఉండాలన్నారు.నైతిక వ్యాపార విధానాలు, ఉపాధి అవకాశాల కల్పన, విశ్వసనీయ పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడతాయని తెలిపారు. SLN శ్రీ లక్ష్మీ నివాస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ద్వారా హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, ఓపెన్ ప్లాట్లు, DTCP, TG RERA అనుమతులు కలిగిన ప్రాజెక్టులు, సైట్ విజిట్స్‌కు సంబంధించిన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ కొనసాగిస్తున్న వెంచర్లలో FORT AVENUE, SRI LAKSHMI MEADOWS, MEGA GOLDEN CITY, LAVITRA HOME SPACES ఉన్నాయని తెలిపారు.**యువతే నవభారతానికి శక్తి** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్న శ్రీహరి, యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, నిజాయితీతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్య, ఆవిష్కరణలు, సాంకేతికత, పారిశ్రామికత, సమష్టి బాధ్యత భారతదేశాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని అన్నారు. “స్వాతంత్ర్య సమరయోధులను



మాటలతోనే కాకుండా మన నిజాయితీతో కూడిన కృషి, ఐక్యత, సమాజ సేవ ద్వారా గౌరవిద్దాం. మన జాతీయ పతాకం మరింత బలమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన, సుసంపన్నమైన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి నింపాలి” అని శ్రీహరి ఆకాంక్షించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలతో పాటు దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.జై హింద్... జై భారత్!ఫొటో క్యాప్షన్: భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన SLN శ్రీ లక్ష్మీ నివాస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ డైరెక్టర్, కింగ్ మేకర్స్ టీమ్ లీడర్ సిలువేరు శ్రీహరి.

# కేజీబీవీ మల్యాలకు రూ.22 వేల మైక్ సెట్ అందజేత

**రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**
**డా. ఏంపల్ల బుచ్చిరెడ్డి దాతృత్వంతో మైక్ సెట్ వితరణ**




ప్రభాత సూర్యుడు యాదాద్రి భువనగిరి, ఆగస్టు 14:యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాలలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి రూ. 22 వేల విలువైన మైక్ సెట్‌ను రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో అందజేశారు.ఔషాపూర్ కేపాల్ బోన్స్ సెట్టింగ్ సెంటర్ అధినేత డా. ఏంపల్ల బుచ్చిరెడ్డి దాతృత్వంతో ఈ మైక్ సెట్‌ను సమకూర్చారు. డా. ఏంపల్ల బుచ్చిరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సాయిలక్ష్మికి మైక్ సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డా. ఏంపల్ల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలను రోటరీ క్లబ్ నిర్వహిస్తోందని, అందులో భాగంగానే విద్యార్థులకు ఉపయోగపడే మైక్ సెట్‌ను కేజీబీవీకి అందజేసినట్లు తెలిపారు. విద్యాసంస్థలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు దాతలు ముందుకు రావడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డం. జ్ఞాన ప్రకాష్ రెడ్డి, చైర్మన్, కొత్త సోషల్ మీడియా కాకతీయ రీజియన్; కరిపె నర్సింగ్ రావు, మాజీ అధ్యక్షుడు; కడారు రమేష్ బాబు, కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఫొటో క్యాప్షన్: మల్యాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి రూ. 22 వేల విలువైన మైక్ సెట్‌ను అందజేస్తున్న డా. ఏంపల్ల బుచ్చిరెడ్డి, రోటరీ క్లబ్ ప్రతినిధులు.

# హర్ ఘర్ తిరంగ్ దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు

**జాతీయ జెండాను ఎగరవేసిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష**



ఇబ్రహీంపట్నం 14 ప్రభాత సూర్యుడు: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, “హర్ ఘర్ తిరంగా” ర్యాలీ బీజేవీ అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష , కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపెల్లి అంజయ్య, పాల్గొని మాట్లాడుతూ 80 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవాలని పురస్కరించుకొని దేశ ప్రజలు ప్రతి ఒక్కరూ ఇంటిపైన జాతీయ జెండాను ఎగరవేసి మన దేశ ఐక్యతను చాటుదామని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా సాహకోశాధికారి తాంద్ర రవీందర్ , ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు నాగని యాదయ్య , ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు గోగికర్ రమేష్ , ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు అంబోజి జగదీష్ , మొండి గౌరెల్లి సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి ,చింతుల్ల సర్పంచ్ ఆంబోజి రమేష్ , తాడిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్ ,దీజేవీ అధికార ప్రతినిధి వనవాడ రవీందర్ రెడ్డి ,బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు కొండాపురం నాగరాజు , కుంచారం సందీప్ రెడ్డి , ఉపాధ్యక్షులు పల్లపు నరేష్ కడారి జంగయ్య, బొడ్డు భాషయ్య, ఉపసర్పంచ్లు గౌర లక్ష్మణ్, గౌర నాగరాజు, రవీందర్,, బిజెపి నాయకులు నాయిని పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సంతోష్ గుప్తా, నారిమల రమేష్,పత్తి రాజు, సాటు మల్లేష్ ,ాజ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుమాళ్ళ విక్రమ్ , పల్లపు రవీందర్ గారు, శ్రీకాంత్ రెడ్డి,బన్నే శివ,బూర సందీప్, కానుగుల కృష్ణ , బిజెపి నాయకులు వివిధ స్కూల్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# క్షయ నిర్మూలనకు పోషకాహారం కీలకం




మంచిర్యాల, ఆగస్టు 14, ప్రభాత సూర్యుడు: క్షయ వ్యాధి గ్రస్తులకు పోషకాహారం అందించడం ద్వారా వారిలో రోగ నిరోధక శక్తిని పెంచవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం భగత్‌సింగ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో 25 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల క్షయ వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు సహాయం చేసేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ స్ఫూర్తి బాధ్యతగా మారాలి: ఉషశ్రీ తాల్క

**“స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవిస్తూ ఐక్యంగా, బాధ్యతాయుతంగా మరింత బలమైన భారతదేశాన్ని నిర్మిద్దాం”**

ప్రభాత సూర్యుడు హైదరాబాద్, ఆగస్టు 15: భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తాల్క ట్రస్ట్ చైర్‌పర్సన్, కేకే అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలు శ్రీమతి ఉషశ్రీ తాల్క తెలంగాణ ప్రజలతో పాటు దేశ ప్రజలందరికీ హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.భారతదేశం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సాధించింది. 2026 ఆగస్టు 15 నాటికి స్వాతంత్ర్యం పొంది 79 సంవత్సరాలు పూర్తవుతుండగా, దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోంది. 2025లో కేంద్ర ప్రభుత్వ అధికారిక సమాచారంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవంగా పేర్కొన్న నేపథ్యంలో, 2026 వేడుక 80వ స్వాతంత్ర్య దినోత్సవం అవుతుంది.దేశ స్వేచ్ఛ కోసం పోరాడి ప్రాణత్యాగాలు చేసిన అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు, అమరవీరుల సేవలను ఈ సందర్భంగా ఉషశ్రీ తాల్క స్మరించుకున్నారు. వారి త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛను కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు.**మన స్వేచ్ఛ... మన గర్వం... మన బాధ్యత**స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం ఒక వేడుకగా చూడకుండా, దేశం పట్ల ప్రతి పౌరుడికి ఉన్న బాధ్యతను గుర్తుచేసే మహత్తర సందర్భంగా భావించాలని ఆమె పిలుపునిచ్చారు.ముఖ్యంగా యువత ఐక్యత, సమానత్వం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, సేవాభావం వంటి విలువలను జీవితంలో ఆచరించాలని కోరారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.“స్వాతంత్ర్య సమరయోధులకు మనం అందించే నిజమైన నివాళి కేవలం వారిని స్మరించుకోవడమే కాదు. భవిష్యత్ తరాలకు మనం ఎలాంటి భారతదేశాన్ని అందిస్తున్నామన్నదే వారికి ఇచ్చే అసలైన గౌరవం. ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తే దేశం మరింత బలపడుతుంది” అని ఉషశ్రీ తాల్క పేర్కొన్నారు.ప్రజా ఆస్తులను పరిరక్షించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం, మహిళలు--వృద్ధులు--పిల్లలను గౌరవించడం, సామాజిక ఐక్యతను కాపాడటం, చట్టాలను గౌరవించడం, సమాజ అభివృద్ధి కార్యక్రమాల్లో బాధ్యతాయుతంగా పాల్గొనడం కూడా దేశ సేవలో భాగమేనని ఆమె తెలిపారు.దేశాభివృద్ధితో పాటు ప్రజల్లో అవగాహన, బాధ్యతాయుత పౌరసత్వం, సామాజిక సేవాభావం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ సంక్షేమాన్ని కూడా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించినప్పుడే స్వాతంత్ర్య ఫలాలు మరింత సార్థకమవుతాయని పేర్కొన్నారు.దేశ ప్రజలందరూ భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకుంటూ, కుల, మత, ప్రాంత,



భాషా భేదాలకు అతీతంగా భారతీయులుగా ఐక్యంగా ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు.శ్రీమతి ఉషశ్రీ తాల్క, ఎంఏ, బి.ఎడ్., ఎంఏ (జర్నలిజం) ప్రస్తుతం తాల్క ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా, కేకే అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా సేవలందిస్తున్నారు.80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె ఇచ్చిన సందేశం:“స్వేచ్ఛ మనలో స్ఫూర్తిని నింపాలి...ఐక్యత మనల్ని బలోపేతం చేయాలి...బాధ్యత మన దేశాన్ని ముందుకు నడిపించాలి...



# ‘సలార్ 2’ సీక్వెల్‌పై క్లారిటీ..

## మళ్లీ ప్రభాస్-నీల్ రణరంగం!

ప్రస్తుతం ప్రశాంత్ నీల్, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్‌తో –డ్రాగన్– అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే.రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వచ్చిన –సలార్: పార్ట్ 1 – సీజ్‌ఫైర్– ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో ఈ మూవీ సీక్వెల్ –సలార్: పార్ట్ 2 -- శౌర్యాంగ పర్వం– ఎప్పుడెప్పుడు మొదలవుతుందా అని అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే గత కొన్ని నెలలుగా ఈ ప్రాజెక్ట్ వాయిదా పడిందని లేదా ఆగిపోయిందంటూ వస్తున్న పుకార్లకు చెక్ పెడుతూ మేకర్స్ సలార్–2 ప్రీ–ప్రొడక్షన్ పనులను అధికారికంగా స్టార్ట్ చేసారు.గతంలో సలార్ సీక్వెల్ రద్దయిందంటూ సోషల్ మీడియాలో రకరకాల రూమర్లు చక్కర్లు కొట్టాయి. అయితే హోంబలే ఫిల్మ్స్ సంస్థ జనవరిలోనే ప్రభాస్– శ్రుతి హాసన్ కలిసి ఉన్న సెట్స్ లోని ఫోటోను షేర్ చేస్తూ ఆ వార్తలను ఖండించింది. తాజాగా దర్శకుడు ప్రశాంత్ నీల్– నిర్మాత విజయ్ కిరగందూర్ ప్రత్యేకంగా సమావేశమై.. సీక్వెల్ నిర్మాణ షెడ్యూల్స్– తుది స్క్రిప్ట్‌పై చర్చలు జరిపారు. ఈ ప్రాజెక్ట్‌ను మొదటి భాగం కంటే అత్యంత భారీ స్థాయిలో ఒక అద్భుతమైన సినిమాటిక్ వండర్‌గా తెరకెక్కించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్, యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్‌తో –డ్రాగన్– అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇటీవల ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స జరగడంతో ఆయన తిరిగి షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టడానికి రెండు నుండి మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ... ప్రశాంత్ నీల్ –డ్రాగన్–'లో హీరో లేని సన్నివేశాలను చిత్రీకరిస్తూనే... మరోవైపు –సలార్–2– ప్రీ–ప్రొడక్షన్– స్క్రిప్ట్ వర్క్ పై పూర్తి దృష్టి సారించినట్లు సమాచారం.మొదటి భాగం చివర్లో దేవా (ప్రభాస్) ఖాన్సార్ రాజ్యాధిపత్యానికి అసలైన వారసుడని... ఆయన శౌర్యాంగ తెగకు చెందినవాడని సంచలన నిజం వెల్లడైన సంగతి తెలిసిందే. బాల్య మిత్రులైన దేవా... వరదరాజ మన్నార్ (పృథ్వీరాజ్ సుకుమారన్) మధ్య ఏర్పడే విభేదాలు... శౌర్యాంగ తెగ ఉనికి కోసం జరిగే సుదీర్ఘ పోరాటమే –శౌర్యాంగ పర్వం– కథాంశం. ఈ సీక్వెల్‌లో ఖాన్సార్ రాజ్యంలో అధికారం కోసం సాగే రక్తపాతం.. నమ్మకద్రోహం... బంధాల మధ్య నడిచే ఉత్కంఠభరిత నాటకాన్ని మరింత తీవ్రమైన యాక్షన్ సీక్వెన్స్‌లతో చూపించనున్నారు.



# పూరికి విజయ్ సేతుపతి బ్రేక్



పూరి పేరు మీద తెలుగులో ఇప్పుడు పెద్దగా బిజినెస్ జరిగే పరిస్థితి లేదు. అందుకే ‘స్లమ్ డాగ్’కు విజయ్ సేతుపతికి మంచి మార్కెట్ ఉన్న తమిళనాట రిలీజే కీలకం. ఒక బలమైన కమ్ బ్యాక్ ఇవ్వాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాడు టాలీవుడ్ సీనియర్ డైరెక్టర్ పూరి జగన్నాథ్. ‘లైగర్’, ‘డబుల్ ఇస్మార్ట్’ డిజాస్టర్ల తర్వాత ఆయన చాలా టైం తీసుకుని చేసిన సినిమా.. స్లమ్ డాగ్. తెలుగులో స్టార్లు ఎవరూ తనకు డేట్లు ఇచ్చే పరిస్థితి లేని నేపథ్యంలో ఈసారి ఆయన తమిళ విలక్షణ నటుడు విజయ్ సేతుపతితో ఈ సినిమా చేశారు. ఐతే ‘స్లమ్ డాగ్’ షూట్ గత ఏడాదే పూర్తయినా.. ఫస్ట్ కాపీ కూడా ఎప్పుడో రెడీ అయినా.. విడుదలకు మాత్రం నోచుకోవట్లేదు. ముందేమో పూరి గత సినిమాలకు సంబంధించిన ఫైనాన్స్ గొడవల వల్ల ఈ చిత్రం విడుదల కావట్లేదన్నారు. తర్వాత ఆ సమస్యలను పరిష్కరించుకుని సినిమాను బయటికి తేవాలని చూస్తున్నా కుదరడం లేదు. ఇక్కడ సమస్య విజయ్ సేతుపతినే అని తెలుస్తోంది. పూరి పేరు మీద తెలుగులో ఇప్పుడు పెద్దగా బిజినెస్ జరిగే పరిస్థితి లేదు. అందుకే ‘స్లమ్ డాగ్’కు విజయ్ సేతుపతికి మంచి మార్కెట్ ఉన్న తమిళనాట రిలీజే కీలకం. ఐతే అక్కడ సేతుపతి దారి ఇవ్వట్లేదని తెలుస్తోంది. ఆయన నటించిన రెండు సినిమాలు వచ్చే రెండు నెలల్లో రిలీజ్ కానున్నాయి. మిస్కిన్ దర్శకత్వంలో సేతుపతి నటించిన ‘ట్రైన్’ ఈ నెలలోనే విడుదల కావాల్సి ఉండగా.. సెప్టెంబరులో కొత్త రిలీజ్ డేట్ ఇచ్చారు. మరోవైపు సేతుపతితో ‘నడువుల కొంజం పక్కత కానం’ లాంటి క్లాసిక్ తీసిన బాలాజీ.. ఇప్పుడీ హీరోతో ‘బత్తా’ అనే మూవీ చేశాడు. అది అక్టోబరులో రిలీజ్ కాబోతోంది. పూరి సినిమా లైన్లో ముందు ఉన్నప్పటికీ.. దాన్ని పక్కన పెట్టి వేరే రెండు చిత్రాలనే ముందు థియేటర్లలోకి తీసుకొస్తున్నాడు సేతుపతి. దీంతో ‘స్లమ్ డాగ్’ను ఈ ఏడాది చివరికి కానీ రిలీజ్ చేసే పరిస్థితి కనిపించడం లేదు. ముందు పూరి వల్లే ‘స్లమ్ డాగ్’ విడుదల ఆలస్యం అయినప్పటికీ.. ఇప్పుడు సేతుపతి వల్ల మరింత లేట్ తప్పట్లేదు. విడుదల మరీ ఆలస్యం అయితే సినిమాకు బజ్ ఇంకా ఇంకా తగ్గిపోయే ప్రమాదం ఉంది. మరి లేటుగా వచ్చినా, లేటెస్ట్‌గా పూరి హిట్ కొడతాడేమో చూడాలి.

# ‘ది ప్యారడైజ్’ ఆ సీనియర్ యాక్టర్‌కు కలిసి వస్తుందా..?




సీనియర్ నటుడు మంచు మోహన్ బాబు గత కొన్నేళ్లుగా చాలా జాగ్రత్తగా సినిమాలు ఎంచుకుంటూ, పలు అవకాశాలను తిరస్కరిస్తూ వచ్చారు. ‘బుజ్జిగాడు’, ‘యమదొంగ’, ‘మహానటి’ వంటి చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఇటీవల ఘట్టమనేని వారసుడు జయకృష్ణ అరంగేట్ర చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’లో ఆయన కీలక పాత్ర పోషించినప్పటికీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ పరిచింది. అందులో మోహన్ బాబు క్యారెక్టర్ డిజైన్ అరకొరగానే ఉండటంతో ఆ ప్రయత్నం విఫలమైంది.వరుసగా ప్రాజెక్టులను తిరస్కరించి, ఇలాంటి ఫ్లాప్ సినిమాను ఎంచుకోవడంపై ట్రేడ్ వర్గాల్లో చర్చ నడిచింది. ఈ నేపథ్యంలో నాచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం ‘ది ప్యారడైజ్’లో మోహన్ బాబు ఒక అత్యంత కీలకమైన, శక్తివంతమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో ఆయన క్యారెక్టర్ కథను మలుపు తిప్పేదిగా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విడుదలైన మోహన్ బాబు ఫస్ట్ లుక్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రాగా, నటుడిగా ఆయన కెరీర్‌కు ఈ చిత్రం చాలా కీలకమని విశ్లేషకులు భావిస్తున్నారు. చెరుకూరి సుధాకర్ నిర్మాణంలో భారీ అంచనాల నడుమ రూపొందుతున్న ‘ది ప్యారడైజ్’ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మెగాస్టార్ వర్సెస్ సూపర్ స్టార్.. డబుల్ క్లాష్ తప్పదా..?



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి, కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ బాక్సాఫీస్ వద్ద ఎదురెదురుగా తలపడటం ఎప్పుడూ అత్యంత ఆసక్తికరమైన విషయమే. గతంలో ‘భోళా శంకర్’, ‘జైలర్’ చిత్రాలతో క్లాష్ అయిన ఈ ఇద్దరు లెజెండ్స్.. ఇప్పుడు మళ్లీ రాబోయే దసరా, సంక్రాంతి రేసుల్లో పోటీ పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇప్పటికే అక్టోబర్ 15న ‘జైలర్ 2’ విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటించగా, మరోవైపు వాయిదాలు పడుతూ వస్తున్న చిరంజీవి ‘విశ్వంభర’ను అక్టోబర్ 16న దసరా కానుకగా తీసుకొచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. మెగాస్టార్ పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న దీనిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఈ దసరా క్లాష్ మాత్రమే కాకుండా, 2027 సంక్రాంతి బరిలోనూ వీరిద్దరూ పోటీ పడే సూచనలు కనిపిస్తున్నాయి.కమల్ హాసన్ నిర్మాణంలో రజనీ నటిస్తున్న ‘ధర్మన్’ చిత్రాన్ని పొంగల్ కానుకగా తేవాలని చూస్తుండగా, బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి చేయనున్న ‘మెగా158’ ప్రాజెక్ట్‌ను కూడా సంక్రాంతికే సిద్ధం చేయాలని ప్లాన్ చేస్తున్నారట. అయితే, బడా సినిమాల విడుదల తేదీలు చివరి నిమిషంలో మారడం సహజమే కాబట్టి, ఈ అరుదైన బాక్సాఫీస్ సమరాల్లో ఏవి చివరి వరకు రేసులో నిలుస్తాయో కాలమే సమాధానం చెప్పాలి.

# స్టార్ డైరెక్టరా.. యంగ్ టాలెంటా? అఖిల్ నెక్స్ట్ ఎటు?

‘లెనిన్’ సినిమాతో బాక్సాఫీస్ దగ్గర మంచి రిజల్ట్ దొరకడంతో అక్కినేని అఖిల్ నెక్స్ట్ ప్రాజెక్ట్ మీద అందరి ఫోకస్ పడింది.’లెనిన్’ సినిమాతో బాక్సాఫీస్ దగ్గర మంచి రిజల్ట్ దొరకడంతో అక్కినేని అఖిల్ నెక్స్ట్ ప్రాజెక్ట్ మీద అందరి ఫోకస్ పడింది. ప్రస్తుతం కొన్ని కథలు వింటున్న ఈ హీరో నెక్స్ట్ ఎలాంటి అడుగు వేస్తాడనేది ఫిల్మ్ సర్కిల్స్ లో ఆసక్తిగా మారింది. మళ్లీ పేరున్న సీనియర్ దర్శకుడికి ఛాన్స్ ఇస్తాడా, లేక లెనిన్ రిజల్ట్ తో వచ్చిన నమ్మకంతో కొత్త తరం దర్శకుడితోనే ముందుకు వెళ్తాడా అనేది ఇప్పుడు మెయిన్ పాయింట్. 4 అఖిల్ కెరీర్ గ్రాఫ్ ఒకసారి గమనిస్తే ఎక్కువగా దర్శకుల విషయంలో పెద్ద పేర్లనే నమ్ముకుంటూ వచ్చాడు. మొదటి సినిమాను ఏకంగా వీవీ వినాయక్ చేతిలో పెట్టగా, రెండో సినిమా ‘హలో’ కోసం విక్రమ్ కె కుమార్‌తో పనిచేశాడు. అప్పటికే ఈ ఇద్దరు దర్శకులకు ఇండస్ట్రీలో మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. ఆ తర్వాత మూడో ప్రాజెక్ట్ ‘మిస్టర్ మజ్ను’ టైమ్ కి మాత్రం అప్పుడే తొలిప్రేమతో హిట్ కొట్టిన వెంకీ అట్లూరికి అవకాశం ఇచ్చాడు. అక్కడి నుంచి మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ కోసం బొమ్మరిల్లు భాస్కర్‌ను ఎంచుకున్నాడు. ఆ సినిమా రిజల్ట్ బాక్సాఫీస్ దగ్గర బాగానే వర్కౌట్ అయింది. కానీ ఆ వెంటనే మళ్లీ స్టార్ డైరెక్టర్ అంటూ సురేందర్ రెడ్డితో ఏజెంట్ ప్రాజెక్ట్ సెట్ చేసుకున్నాడు. లుక్ పరంగా, యాక్షన్ పరంగా ఎన్నో ప్రయోగాలు చేసినా ఆ సినిమా పెద్ద డిజాస్టర్ గా మిగిలిపోయింది. కెరీర్ లో అత్యధిక అంచనాలతో వచ్చిన ఆ ప్రాజెక్ట్ భారీ నిరాశను మిగిల్చింది. ఏజెంట్ ఇచ్చిన ఆ చేదు అనుభవం తర్వాత లెనిన్ కోసం ఎంచుకున్న దారి పూర్తిగా డిఫరెంట్ గా ఉంది. అప్పటికి కేవలం వినరో భాగ్యము విష్ణు కథ మూవీ మాత్రమే చేసిన మురళీ కిషోర్ అబ్బూరు చెప్పిన కథను నమ్మాడు. దర్శకుడి ఇమేజ్ కంటే స్క్రిప్ట్ కే ఫస్ట్ ఓటు వేశాడు. రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో వచ్చిన లెనిన్ ఆడియన్స్ కు బాగా కనెక్ట్ అవ్వడంతో ఈ డెసిషన్ అఖిల్ కు బాగా కలిసి వచ్చింది. సరిగ్గా ఇక్కడే అక్కినేని ఫ్యాన్స్ లో కొత్త క్వశ్చన్ రైజ్ అవుతోంది. చేతిలో ఒక హిట్ ఉంది కాబట్టి ఆ ఇమేజ్ ను డబుల్ చేయడానికి ఎవరైనా ఎక్స్ పీరియన్స్ ఉన్న డైరెక్టర్ ను సెట్ చేసుకుంటాడా అనేది ఒక పాయింట్. లేదు కంటెంట్ కే కట్టుబడి మళ్లీ ఎవరైనా యంగ్ డైరెక్టర్ కు గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా అనేది ఇంకో పాయింట్. ట్రాక్ రికార్డ్ చూస్తే ఒకే ప్యాటర్న్ ఎప్పుడూ ఫాలో అవ్వలేదు కాబట్టి ఫలానా రూట్ లోనే వెళ్తాడని కచ్చితంగా చెప్పలేం. అయితే ఏజెంట్ ఫెయిల్యూర్, లెనిన్ సక్సెస్ లను పక్కపక్కన పెట్టి చూస్తే ఒక లాజిక్ క్లియర్ గా అర్థమవుతుంది. ఇక్కడ దర్శకుడి పేరు ఎంత పెద్దది అనే దానికంటే, యాక్టర్ కు ఎంతవరకు సెట్ అయ్యే కథ దొరికింది అనేదే అసలైన మేటర్. ప్రస్తుతం వింటున్న కథల్లో అఖిల్ దేనికి ఓటు వేస్తాడు, ఆ ప్రాజెక్ట్ ను హ్యాండిల్ చేసేది కొత్త టాలెంటా లేక సీనియర్ డైరెక్టరా అనేది త్వరలోనే తేలిపోతుంది.



# అప్డేట్లు లేకపోవడం వెనుక అసలు ట్విస్ట్ ఇదేనా?

నాగచైతన్య– కార్తిక్ దండు కాంబినేషన్‌లో రూపొందుతున్న మిస్టిక్ హారర్ థ్రిల్లర్ కూడా అదే రకమైన స్ట్రాటజీని ఫాలో అవుతూ డిస్కషన్ కు కారణమైంది సినిమా ప్రచారం అంటే ఒకప్పుడు ఫస్ట్ లుక్, టీజర్, సాంగ్స్, ట్రైలర్, ఇంటర్వ్యూలు, ఈవెంట్లతో రెగ్యులర్ హడావుడి కనిపించేది. కానీ ఇటీవల కొన్ని పెద్ద ప్రాజెక్టులు పూర్తిగా భిన్నమైన వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. మొదలైనప్పుడు ఒక చిన్న టీజర్ లేదా కాన్సెప్ట్ గ్లింప్స్ రిలీజ్ చేసి, ఆ తర్వాత చాలా కాలం ఎలాంటి అప్డేట్లు ఇవ్వకుండా ఉ ఒడటం ఇప్పుడు కొత్త మార్కెటింగ్ ట్రెండ్‌గా మారుతోంది. నాగచైతన్య–కార్తిక్ దండు కాంబినేషన్‌లో రూపొందుతున్న మిస్టిక్ హారర్ థ్రిల్లర్ కూడా అదే రకమైన స్ట్రాటజీని ఫాలో అవుతూ డిస్కషన్ కు కారణమైంది.



ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మొదటి విజువల్ మెటీరియల్ రిలీజైన తర్వాత ఫ్యాన్స్ వరుస అప్డేట్లను ఆశించారు. అయితే నెలలు గడిచినా సినిమా నుంచి పెద్దగా ప్రమోషన్స్ కనిపించలేదు. దీంతో ప్రాజెక్ట్ పురోగతిపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, సినిమా పోస్ట్ ప్రొడక్షన్‌కు, ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎక్కువ టైమ్ కేటాయిస్తున్నట్లు డిస్కషన్ నడుస్తోంది. మిస్టిక్ హారర్ జానర్‌లో వాతావరణం, విజువల్ డిజైన్, సౌండ్ ఎలిమెంట్స్ కీలకం కావడంతో మేకర్స్ తొందరపడకుండా పనులు పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది అప్డేట్లు ఆలస్యం కావడం ప్రతి సారి నెగెటివ్ సిగ్నల్ కాకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో అదే క్యూరియాసిటీని పెంచే సాధనంగా మారుతుంది. ఆడియన్స్ కు ప్రతి వారం కొత్త పోస్టర్ లేదా వీడియో ఇవ్వకుండా, సినిమా గురించి మాట్లాడుకునే స్పేస్‌ను సోషల్ మీడియాకే వదిలేయడం కూడా ఒక మార్కెటింగ్ పద్ధతిగా మారుతోంది. ముఖ్యంగా మిస్టరీ, హారర్, థ్రిల్లర్ జానర్లలో ఎక్కువ సమాచారం బయటకు రాకపోవడం ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతుంది. నాగచైతన్య కెరీర్ పరంగా కూడా ఇది ఆసక్తికర దశ అనే చెప్పుకోవాలి. కమర్షియల్, రొమాంటిక్ కథల తర్వాత భిన్నమైన జానర్ల వైపు అడుగులు వేస్తున్న చైతూకి ఈ సినిమా ఇమేజ్ పరంగా కీలకంగా మారే అవకాశం ఉంది. మరోవైపు దూత సెకండ్ సీజన్ వర్క్స్ కూడా వేగంగా సాగుతున్నాయి. అంటే థియేట్రికల్ మార్కెట్‌తో పాటు ఓటీటీ ఆడియన్స్‌ న కూడా చైతూ సమాంతరంగా టార్గెట్ చేస్తున్నట్టు అర్థమవుతుంది. డిసెంబర్ రిలీజ్ టార్గెట్ గా పనులు కొనసాగుతున్నాయనే ప్రచారం మధ్య, అఫీషియల్ అనౌన్స్‌మెంట్స్ కంటే ఈ సైలెన్స్‌నే ఇప్పుడు సినిమా బలంగా మార్చే ప్రయత్నం జరుగుతోందా అనే చర్చ పరిశ్రమలో వినిపిస్తోంది. రిలీజ్ డేట్ ను ఒకేసారి అనౌన్స్ చేస్తే ఆ గ్యాప్ వల్ల ఏర్పడిన క్యూరియాసిటీ సినిమాకు అదనపు బజ్ తీసుకురావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం చూస్తుంటే, ఓవర్ ప్రమోషన్ కంటే కంట్రోల్డ్ సైలెన్స్ కూడా ఒక మార్కెటింగ్ టూల్‌గా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555